క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్చంపేట: మండలంలో మంగళ, బుధవారాలలో మధ్యాహ్నం 12 –సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శివకోటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలానికి నూతనంగా మరో 33/11 కేవీ విద్యుత్ లైను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్రోసూరు మండలం ఊటుకూరు నుంచి అచ్చంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ఈ లైను ఉంటుందన్నారు. ప్రస్తుతం చిగురుపాడు వరకు స్తంభాలు వేసి లైన్లు లాగామని చెప్పారు. చిగురుపాడు నుంచి అచ్చంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తీగలు లాగే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. 10వ తరగతి పరీక్ష జరిగే సమయంలో, పరీక్ష అనంతరం సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పాఠశాలకు తాగునీటి క్యాన్లు వితరణ



అచ్చంపేట: వెంకటరాజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలకు తాగునీటి కూలింగ్ క్యాన్లు అందించారు. టీఎస్ఆర్ జెడ్పీ హెచ్ స్కూలు హెచ్ఎం చిగురుపాడు కళ్యాణికి ట్రస్ట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసమూర్తి సోమవారం 20 క్యాన్లు అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు పసుపులేటి పాపిరెడ్డి, వీరవల్లి కిషోర్, తాయి కరిముల్లాబాబు, గొల్లపూడి అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శిక్షణ



నకరికల్లు: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటే లక్ష్యసాధన సాధ్యమని కెరీర్ కౌన్సిలర్ ఎ.శాంతివర్ధన్ అన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు కెరీర్ అండ్ మెంటల్‌హెల్త్ ఎడ్యుకేషన్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళికతో సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా మొత్తం అందజేత

నకరికల్లు: బ్యాంకుల ద్వారా అందించే బీమా అందరికీ ఉపయోగపడుతుందని ఎస్‌బీఐ శాఖ మేనేజర్ వై.వెంగళరెడ్డి తెలిపారు. నకరికల్లుకు చెందిన జూలకంటి సతీష్‌కు చెందిన ఫ్యాన్సీషాపులో అగ్నిప్రమాద జరిగింది. ఆయనకు ముద్ర రుణం రూ.2 లక్షలు ఉండడంతో జనరల్ ఇన్సూరెన్స్ కింద రూ 1.94 లక్షల బీమా మొత్తం చెక్కు రూపంలో ఎస్‌బీఐ అందించారు. తెలిపారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.


క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలి

సత్తెనపల్లి: క్రికెట్ పోటీల్లో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సత్తా చాటాలని పలువురు న్యాయవాదులు ఆకాంక్షించారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోటీలు జరుగుతున్నాయి. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ టీమ్ సభ్యులను పలువురు న్యాయవాదులు అభినందించారు.

స్థల ఆక్రమణదారులను అడ్డుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో రజక కమ్యూనిటీ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్‌ను రజక సంఘాల సభ్యులు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తొరటి అమరలింగేశ్వరరావు, తొరటి సాంబయ్య, నీలం నాగేశ్వరరావు, నీలం చినరాములు తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



ముప్పాళ్ళ: రేషన్‌దుకాణాల్లో ధరల పట్టికతో పాటుగా స్టాక్ వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌దుకాణాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్.ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సాకేత్‌కు రజిత పతకం

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి బి.సాకేత్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో రజిత పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 100 కేజీల విభాగంలో సాకేత్ రజిత పతకం పొందాడన్నారు.



పెదకూరపాడులో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద బస్ దిగుతున్న విద్యార్థులు



క్రోసూరు జెడ్పీ పాఠశాలలో పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులు

ప్రశాంతంగా పదో తరగతి పరీక్ష



నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు



బెల్లంకొండలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు



సత్తెనపల్లి బాలికోన్నత పాఠశాల కేంద్రం వద్ద విద్యార్థులు



సెయింట్ అగస్టీన్ స్కూల్ వద్ద రూమ్ నెంబర్లు వెతుకుతున్న విద్యార్థులు

అచ్చంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఎంఈవో ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 8 పాఠశాలల నుంచి 507 మందికిగాను 500 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు.

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 132 మంది, అగస్టీన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 209 మంది, బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 205 మంది హాజరయ్యారని ఎంఈవో శివబాబు శ్రీనివాసరావు తెలిపారు.

క్రోసూరు: మండలంలోని ఐదు కేంద్రాలలో 902 మంది పరీక్ష రాశారని ఎంఈవో ఎం.గణేష్ తెలిపారు. స్పెషల్ స్క్వాడ్ ఎంఈవో టి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ బి.సుబ్బారావు, ఏఎస్ఐ ఆర్.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు.

పెదకూరపాడు: మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెదకూరపాడు జెడ్పీ పాఠశాల, సెయింట్ ఆన్స్ పాఠశాల, 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు పరీక్ష రాశారు.

నకరికల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో 198 మంది, శ్రీ విశ్వశాంతి టెక్నో స్కూల్‌లోని కేంద్రంలో 194 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్‌లు మల్లికార్జునరావు, రవినాయక్ తెలిపారు.



క్రోసూరు జైభారత్ స్కూల్ వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 149 మంది విద్యార్థులకు గాను ఇద్దరు రాలేదని అధికారులు తెలిపారు. గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 123 మందికి గాను ఇరువురు గైర్హాజరు, చౌటపాపాయపాలెం పరుచూరి పాఠశాలలో 157 మందికి గాను ఇరువురు రాలేదని పేర్కొన్నారు.

బెల్లంకొండ: మండల వ్యాప్తంగా 253 మందికిగాను 246 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సత్యనారాయణ, డీవో జయప్రకాష్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి బి.రాజకుమారి పరిశీలించారు.

సత్తెనపల్లి: సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా 14 మండలాల పరిధిలో 11,212 మందికిగాను సోమవారం 11,091 మంది హాజరయ్యారు.

ముప్పాళ్ళ: మండల పరిధిలోని మొత్తం ఐదు పాఠశాలలకు గాను 229 మంది విద్యార్థులకు గాను 224 మంది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి.రమేష్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

సత్తెనపల్లి: న్యాయవాదులకు సంబంధించిన బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మాత్రమే రెండు నామినేషన్లు దాఖల య్యాయి. తొలిరోజు ఎనిమిది పదవులకు .. తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్. ఆంజనేయులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి చిలుకా చంద్రశేఖర్, గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి సర్వేపల్లి సీతా రామాంజనేయులు (సీతయ్య), సెక్రటరీ పదవికి బయ్యవరపు నరసింహారావు, సబ్‌కోర్టు సెక్రటరీ పదవికి షేక్ జానీ ఖాజావలి, జాయింట్ సెక్రటరీ పదవికి గుజ్జర్లపూడి సురేష్, ట్రెజరర్ పదవికి బురి సైదయ్య, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి తవ్వా హరినాథ్, లైబ్రేరియన్ పదవికి ఉల్లం.మధులు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం కూడా నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.



మద్దతుదారులతో కలిసి ఆంజనేయులుకు నామినేషన్ అందిస్తున్న చిలుకా చంద్రశేఖర్

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునఃప్రతిష్ట



సాతులూరు రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

నాదెండ్ల: సాతులూరులో చారిత్రాత్మక రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. రూ.2 కోట్లతో నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం 10.41 గంటలకు రెడ్డిపేరంటాలమ్మ తల్లి, నాగేశ్వరస్వామి, శ్రీచక్ర మహామేరువు, శిఖర కలశ ప్రతిష్ట నిర్వహించారు. నెమ్మికంటి నరసయ్య స్వామీజీ బృందం వేద పండితులు హత్తులూరి బాలశంకరశాస్త్రి, కల్యాణ కుమారాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కొండపర్తి పూర్ణాచార్యులు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా, మేళతాళాలతో పునఃప్రతిష్ట నిర్వహించారు. మహాగణపతి పూజ, వాస్తు హోమం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. నరసరావుపేట, చిలకలూరిపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

ప్రత్యేక పూజల్లో ప్రముఖులు...

స్వామివార్ల ప్రత్యేక పూజల్లో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షించారు.

ఘనంగా కుసుమ ధర్మన్న జయంతి

చిలకలూరిపేట టౌన్: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఆ సంస్థ కార్యాలయంలో తొలి దళిత కవి, స్వాతంత్ర సమరయోధుడు కుసుమ ధర్మన్న126వ జయంతిని నిర్వహించారు. సాహితీ విమర్శకులు పీవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుసుమ ధర్మన్న అనేక దళిత ఉద్ధరణ రచనలు చేశారని తెలిపారు. మాకొద్దు ఈ నల్లదొరతనం అంటూ ఆనాటి స్వదేశీయుల మీదనే తిరుగుబాటు చేసిన ధైర్యశాలి ధర్మన్న అని పేర్కొన్నారు. తరువాత తరాలవారికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పానుగుబాటి బుల్లిబాబు, సభ్యులు నలమాల దానయ్య, వడ్లన చంద్రం, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, న్యాయవాది ఇనగంటి నాగరాజు, బత్తుల విక్రమ్, షేక్ బాషా, షేక్ బాజీ, గుంజి వీరాంజనేయులు, తన్నీరు వీరాంజనేయులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సొసైటీ సభ్యులు

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు

నరసరావుపేట రూరల్: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు పాఠశాల హెచ్ఎం ఎం.పార్వతి తెలిపారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదో ఆహ్వాన జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు తెనాలిలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించారు. పాఠశాలకు చెందిన తాళ్లూరి జాన్ పాల్ 50కేజీల విభాగంలో, గుండెపోగు దేవరాజు 44కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్టు హెచ్ఎం వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

అయోడిన్ వాడకంలో జాగ్రత్తలు అవసరం



బెల్లంకొండ: శరీరంలో అయోడిన్ సమతుల్యతను కాపాడుకోవాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. నజీర్ తెలిపారు. సోమవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపం వలన వచ్చే సమస్యలకు పరీక్షలను నిర్వహించారు. 90 మంది విద్యార్థులను పరీక్షించగా వారిలో 9 మందికి అయోడిన్ లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

క్రోసూరు: క్రోసూరులోని దొడ్లేరు రోడ్డులో ఉన్న ఎస్టీ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై అవగాహన సదస్సు సోమవారం ఏర్పాటు చేశారు. ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం పేద ప్రజలకు ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు , పస్తం మల్లయ్య ఫీల్డ్ అసిస్టెంట్ పైర్ల మాణిక్యరావు, ఆవుల గంగరాజు, తిరుపతమ్మ , మల్లా సాయి , మల్లా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వెల్లలూరు గ్రామానికి చెందిన అంబటి వెంకట సుబ్బారావు వర్ధంతి సందర్భంగా వారి కుమార్తె – అల్లుడు సౌజన్య – నాగమల్లేశ్వరరావు వృద్ధులకు సోమవారం అన్నసంతర్పణ జరిపించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు పద్మావతి, సురేష్, నిర్మల రాజు, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం



యడ్లపాడు: మండలంలోని తుర్లపాడు, సందెపూడి, గణేషునివారిపాలెం గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక- నరసరావుపేట కమిటీ సభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.త్రైత సిద్ధాంత ఆదికర్త, ప్రబోధాశ్రమ స్థాపకులు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 గ్రంథాల గురించి ప్రచారం చేశారు. గ్రామస్తులకు త్రైత సిద్ధాంత భావజాలాన్ని పరిచయం చేయడంతో పాటు, రాబోయే ఉగాది పండుగ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్నవెంకటేశ్వర్లు, పెరుగు ఏడుకొండలు, ఎలిశెట్టి రామాంజనేయులు, పగడాల అశోక్, సానికొమ్ము రాజశేఖరరెడ్డి, వెచ్చా రాజేష్ పాల్గొన్నారు.

సాంబయ్య మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు

మాజీ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య అకాల మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటును మిగిల్చిందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన కట్టా సాంబయ్య గుండెపోటుతో మృతి చెందారనే విషయం తెలియడంతో సోమవారం సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో పార్థివ దేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ గుడిపూడి గ్రామంలోనే కాక సత్తెనపల్లి రూరల్ మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతంలో సాంబయ్య కృషి మరువలేనిదన్నారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సాంబయ్య భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి గుడిపూడి గ్రామానికి తరలించారు. అనంతరం నందిగామ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, నాయకులు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, అచ్యుత శివప్రసాద్, అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, హుస్సేన్ మేస్త్రీ, గుడిపూడి, నందిగామ నాయకులు పాల్గొన్నారు.

చదరంగంతో జ్ఞాపకశక్తి

మాచర్ల రూరల్: చదరంగం క్రీడకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ ఆటతో ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం స్థానిక కోదండరామాలయంలో పల్నాడు చెస్ అకాడమి, వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ నేతృత్వంలో నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పల్నాటి ప్రాంతంలో చిన్నారులకు చెస్ క్రీడను నేర్పిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్న చెస్ కోచ్ కె.కిరణ్ కృషి అమూల్యమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను ఏర్పాటు చేస్తూ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతున్న కిరణ్, వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ నిర్వాహకుల కృషి అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, అధ్యక్ష, ట్రెజరీ భవనాశి రవితేజ, బచ్చు రాజ్ కుమార్, వ్యవస్థాపకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జిల్లా సభ్యులు మేడం నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న చైర్మన్ నరసింహారావు, మల్లికార్జునరావు

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

వినుకొండ: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌నాయక్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్, రూరల్ పరిధిలోని రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరని తెలిపారు. మొత్తం 97,750 యూనిట్లకు గాను 87,420 యూనిట్లు మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని, మిగిలిన 12,340 యూనిట్లకు వెంటనే చేయాలని ఆయన ఆదేశించారు. రేషన్ డీలర్లు కూడా చొరవ తీసుకొని తప్పనిసరిగా వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన చెప్పారు. లబ్ధిదారులు కూడా డీలర్లకు సహకరించాలని సూచించారు. లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు.

నాదెండ్లలో..

రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో 57,496 యూనిట్లు ఉండగా, ఇప్పటికే 51,700 ఈకేవైసీ చేయించుకున్నారని ఆయన తెలిపారు. మిగిలిన 5,796 మంది నెలాఖరులోగా చేయించుకోవాలని చెప్పారు. జాబితా రేషన్ డీలర్ల వద్ద ఉందని, దీని ప్రకారం ఈకేవైసీ చేయించాలని ఆయన ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్ నాయక్